క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొఠారీ గ్రామానికి చెందిన బందారు పావని కుమార్తె దియా గత కొన్నిరోజులుగా న్యుమోనియాతో బాధపడుతూ శ్రీకాకుళంలో చికిత్స పొందుతోంది. మెరుగైన చికిత్సకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు తెలియజేశారు. దీంతో 2010–11 సంవత్సరంలో పావనితో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు స్పందించి దియా చికిత్సకు రూ.36,500లు గురువారం అందజేసి స్నేహభావం చాటుకున్నారు.

జాబ్‌మేళాలో 28 మంది ఎంపిక



జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 28 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. దివీస్ లేబోరేటరీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో భాగంగా 78 మంది హాజరవ్వగా.. 28 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, జేకేసీ కో–ఆర్డినేటర్ వి.ల్యూక్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను ఆపండి

టెక్కలి: స్థానిక ఎన్టీఆర్ కాలనీలో పోలీస్‌స్టేషన్‌కు వెనుక భాగంలో నిర్మాణాలు చేపడుతున్న అక్రమ కట్టడాలను తక్షణమే ఆపాలని కోరుతూ కాలనీవాసులు గురువారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రోడ్డుకు ఆనుకుని మురుగు నీరు వెళ్లకుండా అడ్డంగా అక్రమ కట్టడాలు చేపడుతున్నారని, దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని విన్నవించారు. అయితే అక్రమ కట్టడాలపై ప్రశ్నిస్తే తిరుగుబాటు చేస్తున్నారని ఆ ఫిర్యాదులో వెల్లడించారు.

సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవరావు

టెక్కలి: సూపర్ జీఎస్టీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవరావు సూచించారు. స్థానిక ట్యాక్సీ స్టాండ్‌లో వాహనాల డ్రైవర్లతో అవగాహన సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల కొనుగోలుపై జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జీఎస్టీ తగ్గింపు వివరాలను కార్మికులకు వివరించారు. ఆయనతో పాటు ఏఎంసీ చైర్మన్ బి.శేషగిరి తదితరులు ఉన్నారు.

ప్రైవేటు పరం కాకుండా ఆపాలి



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పలాస: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం కాకుండా ఆపాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం కోరారు. ఈ మేరకు పలాసలో బస్సుజాతా గోడ పత్రికలు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22 నుంచి నవంబర్ 12వ తేదీ వరకు జరగనున్న బస్సుజాతాను విజయవంతం చేయాలని కోరారు. ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను తెరవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సాయి, పలాస పట్టణ నాయకుడు సోమేష్, కిరణ్, నితిన్, విజయ్, హరి తదితరులు పాల్గొన్నారు.

పూడికలు తొలగింపు

టెక్కలి: మండలంలోని గూడేం గ్రామంలో రుంకు గణపతిరావు ఆధ్వర్యంలో గ్రామస్తులంతా చెరువులో పూడికల తొలగింపు గురువారం చేపట్టారు. గణపతిరావు తన సొంత డబ్బులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటాడు. దీనిలో భాగంగా గ్రామస్తులతో కలిసి పూడికలు తొలగించినట్లు వెల్లడించారు.

జీతాల చెల్లింపులో జాప్యమవ్వకుండా చూడండి

కవిటి: డీఎస్సీలో ఇటీవల నియమితులైన కొత్త ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులో జాప్యమవ్వకుండా చూడాలని మండల యూటీఎఫ్ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కవిటిలో ఎంఈవో ధనంజయ మజ్జికి వినతి పత్రం గురువారం అందించారు. కొత్తగా చేరిన ఉపాధ్యాయుల ఐడీలు త్వరగా క్రియేట్ చేసి, జీతాలు వీలైన త్వరగా వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ స్కూల్ టీచర్స్ లీవ్స్ విషయంలో కూడా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు అవసరమైన చోట సర్దుబాటు చేయాలన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: బిర్లంగిలో కోటి సంతకాల సేకరణలో పిరియా విజయ, నర్తు నరేంద్ర, బోర పుష్ప తదితరులు



ఇచ్ఛాపురం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సంతబొమ్మాళి: కాకరపల్లి గ్రామంలో కోటి సంతకాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, పేరాడ తిలక్ తదితరులు



సోంపేట: బెంకిలి పంచాయతీలో...



సోంపేట: జింకిభద్ర పంచాయతీలో...



వజ్రపుకొత్తూరు రూరల్: పెదబాడాంలో సంతకాల సేకరణ కార్యక్రమం



వజ్రపుకొత్తూరు: యూఆర్‌కేపురంలో పోస్టర్ ఆవిష్కరణ



మందస: తాళ్లగురంటిలో రచ్చబండ కార్యక్రమం

ప్రైవేటీకరణపై పోరు

- పలు గ్రామాల్లో సంతకాల సేకరణ

రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేయాలని తీసుకున్న నిర్ణయం సరికాదని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రైవేటీకరణతో పేద బిడ్డలకు వైద్య విద్యను దూరం చేయాలని కూటమి కుట్రలు పన్నుతోందని ధ్వజమెత్తారు. ప్రైవేటీకరణను వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్

ఆఖరి మజిలీకి అవస్థలు

- శ్మశానవాటికల్లో సౌకర్యాల లేమి
- మృతదేహాలు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

కవిటి:

మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలకు ఎంతో అవసరమైన శ్మశానవాటికలు సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. బతికినంత కాలం రాజాలా బతికినా.. అవస్థల్లో బతికినా.. అంత్యక్రియలు ప్రశాంతంగా జరిగిపోవాలన్నదే ఎవరికైనా ఉండే కోరిక. కానీ చాలా గ్రామాల్లో ఉన్న శ్మశానవాటికలు, వాటికి వెళ్లేందుకు అవసరమైన మార్గాలు జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో అవస్థలు ఎదురవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రుద్రభూమి అనే కనీస ఇంగిత జ్ఞానం లేకుండా పలుచోట్ల ఆక్రమణలకు తెగబడుతున్నారు. కవిటి, రామయ్యపుట్టుగ, ప్రగడపుట్టుగ, గొండ్యాలపుట్టుగల్లో సుమారు 6,000 మంది ప్రజలు నివసిస్తున్నారు. వీరందరికీ కవిటిలో ఉన్న శ్మశానవాటికే ఆధారం. కానీ ఈ శ్మశానవాటికకు వెళ్లేమార్గం బహిరంగ మల విసర్జనల కారణంగా దుర్గంధ భరితంగా మారింది. అంతేకాకుండా మెయిన్‌రోడ్డు నుంచి ఇంటీరియర్ రోడ్డుకు మృతదేహాన్ని తీసుకెళ్లే మార్గం ఏటవాలుగా ఉండడంతో మృతదేహం పాడి పైనుంచి కింద పడిపోయే పరిస్థితులు దాపురించాయి. ఇక కవిటి శ్మశానవాటిక మూడు ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉండాల్సింది. కానీ క్రమేపీ ఆక్రమణలతో కుచించుకుపోయింది. అందువలన అధికారులు వెంటనే స్పందించి ఈ శ్మశానవాటికకు రక్షణ కల్పించి, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కవిటి శ్మశానవాటికకు వెళ్లే మార్గం

ఒక షెల్టర్ నిర్మించాం



కవిటి మేజర్ పంచాయతీకి నేను సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో శ్మశానవాటికలో ఒక షెల్టర్ నిర్మించాం. దాన్ని ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా తీర్చిదిద్దాలి. వర్షం సమయంలో శవాల దహన సంస్కారాలకు వీలుగా ఓ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

– పాండవ చంద్రశేఖర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు, కవిటి

ఒక్క మనిషి కూడా వెళ్లే అవకాశం లేదు



నాలుగు గ్రామాల్లోని ప్రజలకు ఉన్నది కవిటిలో ఉన్న శ్మశానవాటిక మాత్రమే. మా గ్రామం నుంచి ఈ శ్మశానవాటికకు వెళ్లేందుకు అవసరమైన మార్గంలో రోడ్డు రాళ్లతేలి ఉంది. జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో నలుగురు ఒకేసారి పాడి మోయడం మాత్రమే కాదు.. ఒక్క మనిషి కూడా స్వేచ్ఛగా వెళ్లే అవకాశం లేదు. ప్రభుత్వ యంత్రాంగం దీని ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి సౌకర్యాలు కల్పించాలి.

– బదకల శివ, ప్రగడపుట్టుగ

ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు



కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు నిర్వహిస్తున్న అధికారులు

టెక్కలి: ఎన్‌సీసీలో శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని 14వ ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ శశాంక్ కుశ్వహ అన్నారు. మండలంలోని పాతనౌపడ సమీపంలో ఉన్న ప్రణవి కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఎన్‌సీసీలో చేరాలనే ఆసక్తి అధికంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించి తద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలకు ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ బల్వంత్‌సింగ్, జితేంద్రకుమార్, వి.శ్రీరామ్మూర్తి, రవికృష్ణ, జీసీఐ కె.త్రిశాలి, కళాశాల డైరక్టర్ పి.చంద్రశేఖర్ ఆజాద్, ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారావు, ఎన్‌సీసీ అధికారి బి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఏపీఎస్టీఏ ప్రధాన కార్యదర్శి చందనరావు

నందిగాం: పూర్తిగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పలు పాఠశాలలను గురువారం సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జయపురం పాఠశాలలో మాట్లాడుతూ.. పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వ, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని విస్మరించడం తగదన్నారు. అనంతరం ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బొడ్డేపల్లి రామకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రెటరీ కేకే రామిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సీదిరిని పరామర్శించిన తిలక్



మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో మాట్లాడుతున్న తిలక్ తదితరులు

పలాస: మాజీ మంత్రి సీదిరిపై అక్రమ కేసు నమోదు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. ఈ మేరకు పలాసలో సీదిరి అప్పలరాజును గురువారం పరామర్శించారు. ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులపై శాంతియుతంగా చేస్తున్న కార్యక్రమాల్లో పోలీసులు అనుసరిస్తున్న వైఖరి విడ్డూరంగా ఉందని ధ్వజమెత్తారు. ఆయనతో పాటు నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు చిన్ని జోగారావు, ఎ.విష్ణు తదితరులు ఉన్నారు.

ఇచ్ఛాపురంలో ధర్మాన కృష్ణదాస్ పర్యటన నేడు

కవిటి: వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించనున్నట్లు శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పర్యటనలో భాగంగా ఉదయం 10 గంటలకు కవిటి మండలంలోని లండారిపుట్టుగ పంచాయతీలో, మధ్యాహ్నం 3 గంటలకు సోంపేట మండలంలోని జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఓటరు నమోదుపై స్పష్టత ఉండాలి



మాట్లాడుతున్న ఆర్‌వో పద్మావతి

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సంబంధించి గ్రామాల్లో ఓటరు పేరు నమోదు చేసే సమయాల్లో సంబంధిత బీఎల్‌వోకు అవగాహన, స్పష్టత ఉండాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి బి.పద్మావతి స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, కవిటి, కంచిలి, సోంపేట మండలాలకు చెందిన 299 మంది బీఎల్‌వోలతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆధార్‌కు ఓటరు కార్డును అనుసంధానం చేయాలని, గ్రామంలో ఆరు నెలలు నివాసం ఉంటేనే ఓటరు కార్డును మంజూరు చేయాలని సూచించారు. బీఎల్‌వోల యాప్‌లో ఫారం–6 ఓటరు చేర్పులు, ఫారం–7 తొలగింపులు, ఫారం–8 మార్పులు గురించి వివరించారు. ఇతరుల ప్రలోభాలకు లొంగి కార్డు తొలగింపులు, నివాసం మార్పులు చేయరాదన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రతి ఒక్కరికీ ప్రథమ చికిత్సపై అవగాహన అవసరమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం ప్రతినిధి సత్యనారాయణ, ఎంపీడీవో రమేష్ నాయుడు అన్నారు. మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జూనియర్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరినప్పుడు గాయాలతో ఉన్న క్షతగాత్రులను తరలించే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే గుండె ఆగిపోవడం, శ్వాస అందక ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులకు అందించే సీపీఆర్ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి.హేమారావు, ఎస్‌ఎంసీ చైర్మన్ బి.లక్ష్మీపతి, రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు, వెంకట రమణ, బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకోరా..?

- టెక్కలిలో ఆవులు, కుక్కలు, పందుల స్వైర విహారం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలోని పలు ప్రధాన కూడళ్లలో ఆవులు, కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నప్పటికీ అధికార యంత్రాంగం కనీసం స్పందించకపోవడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో ఆవులు రోడ్లపై సంచరించకుండా గతేడాది స్థానిక వంశధార కాలనీలో గో సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆవులు మాత్రం రహదారులపై సంచరిస్తూ వాహన చోదకులను ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. మరోవైపు భయాందోళన కలిగించే విధంగా శునకాలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. వీటికి తోడు పందుల గుంపులు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. మేజర్ పంచాయతీలో ప్రధాన రహదారులపై ఇటువంటి పరిస్థితి ఉంటే మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు. ఇదిలా ఉండగా కొంతమంది తమ ఆవులను రోడ్లపై వదిలేయడంతో అవి పాలిథిన్‌తో పాటు ఇతర వ్యర్థ పదార్థాలు తినడం వలన ప్రమాదకరమైన రోగాల పాలవుతున్నాయి. అందువలన ఇప్పటికైనా అధికారులు పంచాయతీలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆవులు, శునకాలు, పందుల స్వైర విహారాన్ని కట్టిడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



టెక్కలి పాత జాతీయ రహదారిలో రోడ్డుపైనే తిష్ట వేసిన ఆవులు

ప్రమాదకరంగా మారుతున్నాయి



టెక్కలి మేజర్ పంచాయతీలోని ప్రధాన కూడళ్లలో ఆవులు, కుక్కలు, పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. వాహనాలకు ఎదురు రావడం, ఢీకొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆవుల విషయంలో ఆయా యజమానులు చిత్తశుద్ధిగా వ్యవహరించాలి. కుక్కలు, పందులను అరికట్టేవిధంగా పంచాయతీ యంత్రాంగం చర్యలు తీసుకోవాలి.

– పి.రమణబాబు, వార్డు సభ్యుడు, టెక్కలి మేజర్ పంచాయతీ

ఆదమరిస్తే అంతే..!

- కల్వర్టుపై ఏర్పడిన రంధ్రం
- ప్రమాదాలు జరిగే అవకాశం

కంచిలి:

మండలంలోని అంపురం నుంచి ఘాటి ముకుందాపురం రోడ్డు మార్గంలో బెల్లుపడ గ్రామం వద్ద ఉన్న కల్వర్టరు ఒక పక్కకు కూలిపోయింది. ఆ భాగంలో పెద్ద రంధ్రం ఏర్పడింది. దీనివలన ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి గోవింద సాగరం నుంచి వచ్చే సాగునీరు నారాయణబట్టి చెరువుకు వెళ్లేందుకు వీలుగా కొన్ని దశాబ్దాల క్రితం ఇక్కడ కల్వర్టు నిర్మించారు. అనంతరం దీనిమీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగించడం కారణంగా ఇటీవల కాలంలో అది కూలిపోయింది. అయితే అప్పటికప్పుడు ఆ స్థానంలో ఆదరాబాదరాగా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా కొత్తగా కల్వర్టు నిర్మాణం చేపట్టారు. అనంతరం ఆ నాణ్యతలేని కల్వర్టుపై నుంచే ఇటీవల రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టారు. మరమ్మతుల సమయంలో కల్వర్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని ఆర్‌అండ్‌బీ అధికారులు గుర్తించినా చూసీచూడనట్లు విడిచి పెట్టేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో నాలుగు రోజుల క్రితం కల్వర్టుకు ఒకవైపుకు రంధ్రం పడింది. దీంతో ఈ రంధ్రాన్ని తప్పించుకొని వాహనదారులు ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో మండల పరిధిలో 10 పంచాయతీలతో పాటు సరిహద్దు ఒడిశా పరిధిలో చాలా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రిపూట రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. అందువలన ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కల్వర్టు కూలడంతో ఏర్పడిన రంధ్రం

అధికారుల నిర్లక్ష్యం వలనే...



ఈ కల్వర్టుపై భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వలన దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు కూలిపోయింది. దీంతో అప్పటికప్పుడు సిమెంట్ పైపులు వేసి కల్వర్టు నిర్మించారు. ఆ నిర్మాణంలో ఎటువంటి నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో మళ్లీ తాజాగా చేపట్టిన రోడ్డు మరమ్మతులను కూడా ఆ కల్వర్టుపైనే చేపట్టారు. దీంతో ఇప్పుడు ఈ పరిస్థితి చోటుచేసుకుంది. దీనిపై వెంటనే అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. – అయిధం జయరాం, సర్పంచ్, బెల్లుపడ పంచాయతీ

మెలకువలు పాటించాలి



లేగదూడలకు ఏలికపాము మందును పడుతున్న దృశ్యం

కంచిలి: పాడి రైతులు మేలైన లేగ దూడలు పెంచడం ద్వారా లాభాలు పొందవచ్చని, అందువలన లేగదూడల సంరక్షణలో మెలకువలు పాటించాలని జిల్లా పశుగణనాభివృద్ధి సంఘం ఉపసంచాలకుడు డాక్టర్ సీహెచ్ సత్యప్రకాశ్ అన్నారు. మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామంలో పశుసంవర్ధకశాఖ జిల్లా పశుగణనాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 42 లేగదూడ పెయ్యలకు గాను ప్రథమ బహుమతిని బాలక దీక్షిత్, ద్వితీయ బహుమతి బాలక శశిభూషణ్, తృతీయ బహుమతి బొడ్డ మోహనరావులు దక్కించుకున్నారు. ప్రదర్శనకు తెచ్చిన అన్ని పెయ్యిలకు ఏలికపాము మందులు, లివర్ టానిక్స్, మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ కె.అప్పలస్వామి, మండల పశువైద్యాధికారి టి.శిరీష, సర్పంచ్ పొందల ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.